క్లుప్తంగా

నేడు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నల్లకుంట: నల్లకుంట డివిజన్ నర్సింహ బస్తీలో శుక్రవారం రూ.73 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అంబర్‌పేట శాసన సభ్యులు కాలేరు వెంకటేశ్ భూమి పూజ చేసి సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే ప్రత్యేక బడ్జెట్ ద్వారా మంజూరు చేయించిన నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న గౌతంరావు

అంబర్‌పేట: పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయుతనివ్వాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అభిప్రాయపడ్డారు. భారత్ సేవాశ్రమ్ సంఘ సహకారంతో గురువారం అంబర్‌పేట డివిజన్ పోలీస్ బాయ్స్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆయన నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎంతో ఆత్మవిశ్వాసంగా ఉంటారన్నారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో చదవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నాగభూషణంచారి, ఆనంద్‌గౌడ్, మనోజ్, అయోధ్యరామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుర్వేద పుస్తక విభాగాన్ని ఏర్పాటు చేయాలి



దాసరి శ్రీనివాసులును సన్మానిస్తున్న లైబ్రరీ కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి రిటైర్డ్ ఐఏఎస్, కార్మికశాఖ మాజీ కమిషనర్ దాసరి శ్రీనివాసులు స్ఫూర్తి నింపారు. చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆవరణలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వద్దకు వెళ్లి ముచ్చటిస్తూ సలహాలు, సూచనలు చేశారు. భారతీయ ఆయుర్వేద వైద్యం ఎంతో ఉత్తమమైందని ఈ లైబ్రరీలో ఆయుర్వేదానికి సంబంధించిన పుస్తక విభాగాన్ని ఏర్పాటు చేయాలని దానికి తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా దాసరి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాగంటి అయోధ్య, సుఖేష్‌కుమార్, వెంకటేష్ యాదవ్, అవినాష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి



నల్లకుంట: శ్రీ విష్ణు సహస్రనామ క్షేత్రము ఆవరణలో మండల దీక్షతో శ్రీ విష్ణు సహస్రనామస్తోత్ర అహోరాత్ర జపయజ్ఞములో భాగంగా గురువారం సాయంత్రం నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ సమీపంలోని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాత్ర కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ తన గానంతో ప్రేక్షకులను అలరించారు. విష్ణు సహస్రనామ క్షేత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం ఉంఛవృత్తి, యామ విభాగములతో అన్యోన్య సహాయంతో జప యజ్ఞము, యామాంత సహస్రనామార్చనలు, ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం మహావిష్ణు లక్ష విష్ణు నామాలతో తులసి, బిల్వ, పుష్పార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతి సంగీత విద్యాలయం ఈవెంట్ మేనేజర్లు తేజస్విని, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు చిన్నారులకు టీకా వేయించాలి

బౌద్ధనగర్: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ టీకాలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో గురువారం ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. గతంలో తమ పిల్లలకు టీకాలు ఇప్పించని తల్లులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌గూడ యూపీహెచ్‌సీ వైద్యాధికారిని ఎలిజబెత్, సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్ఎం ఆయేషా, బీఆర్ఎస్ నేత కంది నారాయణ, ఆశావర్కర్లు రాధా, ధన పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో కలుషిత నీటి సరఫరా

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



కుళాయిల నుంచి సరఫరా అవుతున్న కులుషిత నీరు

నల్లకుంట: కుళాయి నుంచి వస్తున్న తాగునీరు దుర్వాసనభరితంగా ఉండటంతో నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ బస్తీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు వారాలకు పైగా ఇదే దుస్థితి నెలకొంది. స్థానిక కార్పొరేటర్ తమ బస్తీ సమస్యలు పట్టించుకోవడం లేదంటున్నారు. కుళాయి నీటిలో మురుగు కలిసిపోయి రావడంతో సమస్యలను జలమండలి అధికారుల వద్ద మొత్తుకున్నా శూన్యమైందని స్థానికులు వాపోతున్నారు. బలహీన వర్గాల ప్రజల నివాసాలు ఉన్న బస్తీపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇంటి నంబర్ 2–2–1107/5 నుంచి 20 వరకు రోజు విడిచి రోజు ఉదయం వేళలో కుళాయిల ద్వారా 15 నిమిషాల నుంచి అరగంట వరకు కలుషిత నీరే సరఫరా అవుతోందని పేర్కొంటున్నారు. గత రెండు వారాలకు పైగా కుళాయిల నుంచి మురుగు నీరు కలిసి వస్తోందని, అధికారులెవరూ పట్టించుకోరు, ఈ కలుషిత నీటిని తాగలేక పోతున్నామని స్థానికులు అంటున్నారు. ఆ తర్వాత కొద్ది మంచిగా వచ్చే నీరు పట్టుకుని వాడుకుంటున్న మాకు వైరల్ జ్వరాలు, చర్మవాధులు వస్తున్నాయని వాపోతున్నారు. నిత్యం డబ్బులు పెట్టి నీళ్లు కొనుక్కుని తాగాలంటే కష్టమేనని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ పద్మా

అంబర్‌పేట: నియోజకవర్గంలో ప్రజల అవసరాలకనుగుణంగా పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ కురుమబస్తీలో రూ.13 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

కొత్తూరు సీతయ్య గుప్తా సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న రమేష్‌గుప్తా తదితరులు

కాచిగూడ: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుసాగాలని స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటి అధ్యక్షుడు తేలుకుంట్ల రమేష్‌గుప్తా అన్నారు. కాచిగూడలోని వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు ఫౌండర్ చైర్మన్, ఫ్రీడం ఫైటర్ కొత్తూరు సీతయ్య గుప్తా 112వ జయంతిని గురువారం వైశ్య హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైశ్య విద్యార్థులకు స్కాలర్ షిప్స్, నోట్ బుక్స్ ఆయన పంపిణీ చేశారు. వైశ్య విద్యార్థుల అభివృద్ధికి సీతయ్య గుప్తా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ డి.ధనుంజయ్, కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి కూర రఘువీర్, పి.జ్ఞాన్ చందర్, ఉప్పాల రాజేశ్వర్, పి.రవిప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న క్రిస్టియన్ ఫెడరేషన్ ప్రతినిధులు

కాచిగూడ: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు, రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఏకే గిడియోను బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షెడ్యూల్డు కులాల వారి మత స్వేచ్ఛ హక్కును హరిస్తూ 1950 ఆగస్టు 10న అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ తెచ్చిన ఉత్తర్వును నిరసిస్తూ దళిత క్రైస్తవ ప్రతినిధులు ప్రతి ఏటా ఆగస్టు 10న బ్లాక్‌డేగా పాటించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద క్రైస్తవులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ చేసిన సిఫారసులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. నేటి ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వమైనా దళిత క్రైస్తవులకు న్యాయం చేసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో క్రైస్తవుల మన్ననలను పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీఎఫ్ ప్రతినిధులు బిషప్ ఎంఎస్ దయానంద్, ఎస్.ప్రదీప్, డాక్టర్ యస్.అబ్రహం, బిషప్ ముక్కాల భాస్కర్, వనితా అలెగ్జాండర్, మంగేశ్వరి, రాజ్‌కింగ్, పాస్టర్ ప్రభాకర్, జాన్ సుందర్ రాజ్, బిషప్, ఎం.ప్రేమ్ కుమార్, ఏలీయా, జి.స్టాన్లీ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మారుతి దివాకర్‌ను సన్మానిస్తున్న కృష్ణ, ఇందిర తదితరులు

కాచిగూడ: జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీఎంసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాలిపల్లి క్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ఇందిర ఆధ్వర్యంలో గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంబర్‌పేటకు చెందిన జీహెచ్ఎంసీ సిబ్బంది, స్వీపర్స్, కామాటీలు జి.మల్లేష్, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

21 నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు 23వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్–2023ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్లీ గైస్ తెలిపారు. గురువారం నారాయణగూడలోని వైఎంసీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. హైస్కూల్ స్థాయి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, క్రికెట్, త్రోబాల్, మార్చ్ పాస్ట్ పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 19వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు నారాయణగూడలోని వైఎంసీఏ సెంటర్‌లో స్వయంగా గానీ, 77996 65544, 9391 025959 లలో గానీ సంప్రదించవచ్చు.

‘ఓటరు నమోదు’ను సద్వినియోగం చేసుకోవాలి



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని, అధికారులు

చిక్కడపల్లి: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఎన్నికల కమిషనర్, జీహెచ్ఎంసీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు డ్రైవ్‌ను ఏఎంసీ ప్రవీణ్ చంద్ర, వెంకటేష్‌తో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. 10రోజులపాటు కొనసాగే ఈ ప్రక్రియను అవసరమైతే గడువును పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన ఓటరు నమోదు, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు ఉన్నట్లైతే వెంటనే సంబంధిత డాక్యుమెంట్స్‌తో అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు శ్రీకాంత్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, దొనేటి సత్యం, సుక్కయాదగిరి పాల్గొన్నారు.

సామాన్యులు నడిచే దారిని తెరవండి



నగర పోలీస్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న గౌతమ్‌రావు

అంబర్‌పేట: సామన్య ప్రజలు రాకపోకలు సాగించే దారిని తెరవాలంటూ బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు నగర పోలీస్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న చిన్నపాటి దారిని రెండురోజుల క్రితం మూసివేశారని దానిని తెరవాలంటూ విజ్ఞప్తి చేశారు. సామాన్య ప్రజలు నిత్యం ఈ దారిగుండా రాకపోకలు సాగిస్తారని వివరించారు. కేవలం పాదాచారులు, ద్విచక్ర వాహనదారులకు మాత్రమే ఉన్న కొద్దిపాటి దారిని పోలీసు విభాగం మూసి వేయడంతో వందలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, శ్యామ్‌రాజ్, నాగభూషణ్‌చారి, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాలనాశాస్త్రంలో మార్పులు అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: మారిన టెక్నాలజీకి అనుకూలంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వ పాలనాశాస్త్రంలో మార్పులు అవసరమని కేంద్ర హోంశాఖ మాజీ సెక్రటరీ, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా చైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత పద్మనాభయ్య (ఐఏఎస్ మాజీ అధికారి) పేర్కొన్నారు. గురువారం దూరవిద్య కేంద్రంలో ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ డిజిటల్ ఎర ఇష్యూస్, ఛాలెంజస్ అండ్ ప్రాస్‌పెక్ట్ అనే అంశంపై రెండు రోజుల జరిగిన జాతీయ సదస్సుకు సోషల్ సైన్స్ డీన్ ప్రొ.స్టీవెన్ సన్ అధ్యక్షత వహించగా కె.పద్మనాభయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. విశ్రాంత ప్రొఫెసర్లు హరగోపాల్, గట్టు సత్యనారాయణ, సోఫీఅలీ, మోహన్‌రావు, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ప్రసంగించారు. అనంతరం పబ్లిక్ అడ్మిస్ట్రేషన్ విభాగం హెడ్ ప్రొ.బాలబ్రహ్మచారి, బీవోఎస్, సదస్సు కన్వీనర్ ప్రొ.అరుణజ్యోతి, డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ తిరుపతి, డాక్టర్ మనోహర్, డాక్టర్ రమణరావు, డాక్టర్ రవితేజా, పరిశోధన విద్యార్థులు పద్మనాభయ్యతో గ్రూప్ ఫొటో దిగారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి

చిలకలగూడ: నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ సౌజన్యంతో సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇన్విటేషనల్ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్ జెర్సీని అసోషియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తన తండ్రి నాగులూరి నర్సింహ జ్ఞాపకార్థం షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు షీల్డ్‌లతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజీవ్, అనీల్‌కుమార్, రఘునందన్, జితేంద్ర, స్వామి, రాంబాబు, శేఖర్,బాలరాజు, ప్రవీణ్, శ్రీనివాస్, మున్నా, శశాంక్, నీలిమా, రమాదేవి, సువర్ణ, హాసిని, నస్రీన్, సౌజన్య ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం

చిలకలగూడ: గుర్తుతెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వెయిటింగ్ హాలు సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో పడిఉన్నట్లు సమాచారం అందుకున్న సెక్యూరిటీ సిబ్బంది, అత్యవసర విభాగానికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో తాగునీటి సమస్యను శాశ్వత ప్రతిపాదికన పరిష్కరించాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. గురువారం డీడీ కాలనీలోని జలమండలి కార్యాలయంలో ఆమె అధికారులతో కలిసి తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై చర్చించారు. డివిజన్‌లో తురాబ్‌నగర్, వడ్డెరబస్తీ, గౌరసంఘం గల్లి, పోచమ్మబస్తీ ప్రాంతాల్లో కలుషిత తాగునీరు సరఫరా అవుతుందన్నారు. అలాగే మ్యాన్‌హోళ్లు ఎక్కడిక్కడ శిథిలావస్థకు చేరాయని, వాటిని తక్షణమే మరమ్మతు చేయాలని ఆమె జలమండలి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు, మేనేజర్ మజీద్‌లతో పాటు స్థానిక బీజేపీ నేతలు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్ ఉమా

కాచిగూడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా సూచించారు. గురువారం కాచిగూడ డివిజన్ మౌలానా ఆజాద్ నగర్ బస్తీ దవాఖానాను ఆమె సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలగురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వ్యాధులపై తగు జాగ్రత్తలు సూచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖానా వైద్యాధికారి డాక్టర్ కౌశిక్, నర్సు కీర్తి, బి.భీమ్‌రాజ్, కృష్ణ, మంగమ్మ, బాలమణి, ఎస్.రవియాదవ్, ఆర్.సంతోష్, దినేష్ పాల్గొన్నారు.

శ్లోక బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ గౌరీ

కాచిగూడ: శ్లోక హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ జాతీయ స్వచ్ఛంద సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఏషియన్ బ్యూటీ క్వీన్–2023 విజయ గౌరిని ఎంపిక చేశారు. శ్లోక ఫౌండేషన్ మహిళల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై చేస్తున్న ప్రాజెక్టులకు విజయగౌరీ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించి వాటి ప్రమోషన్ కార్యక్రమాల్లో ప్రచార కార్యక్రమాలు చేస్తారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంట స్వామి తెలిపారు. 15 ఆగస్టు 2023 నుంచి 15 ఆగస్టు 2024 వరకు విజయ గౌరీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటారని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా మిషన్ గ్రీన్ ఇండియా ప్రమోట్ చేస్తారని ఆయన వెల్లడించారు.



విజయగౌరిని అభినందిస్తున్న గంట స్వామి

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



లాలాపేట: పార్లమెంట్‌లో సీఎం కేసీఆర్, తెలంగాణ సర్కారుపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తార్నాకలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో రైతులు విద్యుత్ కోసం ఎదరు చూస్తే.. నేడు వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తూ తెలంగాణ రైతాంగాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అంజన్న, శివశంకర్, మంత్రి ప్రవీణ్‌కుమార్, డేజిల్, నాగేశ్వర్‌రావు, నానునాయక్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి తొలి మెట్టు



ఎంఎంఎన్ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రముఖ నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం

కాచిగూడ: ఏ రంగంలోనైనా విజయాన్ని అందిపుచ్చుకోవాలంటే, ఆత్మ విశ్వాసమే తొలిమెట్టని ప్రముఖ నటుడు పద్మశ్రీ బ్రహ్మానందం అన్నారు. వీబీజీ సంస్థ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ‘మీటింగ్ మిలియనీర్స్ నెట్‌వర్క్’(ఎంఎంఎన్) లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ.. ఒక దేశం తన సామ్రాజ్యాన్ని విస్తరించాలి అంటే ఎన్నో యుద్ధాలు చేయాలి, కానీ వ్యాపారి ఒక సరైన నెట్వర్క్‌తో వెళ్తే ఎంతో సులువుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించగలడని ఆయన వివరించారు. అలాంటి నెట్‌వర్క్ మిలీయన్స్ మీ ముందు ఉంచేదే ‘మీటింగ్ మిలియనీర్స్ నెట్‌వర్క్’అని అన్నారు. ప్రముఖ నవల రచయిత యండమూరి వీరేంద్రనాథ్, మడిపడిగ రాము, ఇమ్మడి రమేష్, పబ్బతి రవికుమార్, మద్దుల ప్రకాష్, సినీ నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణ, సంపంగి రమేష్, బిగ్‌బాస్ ఫేం ఆషురెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి దేశ సమగ్రత, ఐకమత్యానికి గొడ్డలి పెట్టు



మాట్లాడుతున్న ఎస్.వేణుగోపాల్

కాచిగూడ: ఉమ్మడి పౌరస్మృతి దేశ సమగ్రత, ఐకమత్యానికి గొడ్డలి పెట్టు అని వీక్షణం సంపాదకులు ఎస్.వేణుగోపాల్ అన్నారు. అఖిల భారత మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం హిమాయత్‌నగర్‌లో ‘బిన్న సాంస్కృతుల సమాహర భారతదేశంలో ప్రస్తు పరిస్థితులలో ఉమ్మడి పౌరస్మృతి అవసరమా’అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత దేశంలో 565 సంస్థానాలు ఉన్నాయని, అనేక జాతులు, అనేక భాషలతో కూడిన సమాహారమైన ఈ దేశంలో ఉమ్మడి పౌరస్మృతి ఏ విధంగా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి తీసుకొస్తే రాజ్యాంగానికి వ్యతిరేకం అవుతుందన్నారు. ఉమ్మడి పౌరస్మృతిని అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్తేజల సృజన, ఖలీద్ పర్వీన్, డాక్టర్ బీవీ విజయలక్ష్మి, డాక్టర్ కె.రజని, పశ్య పద్మ, నేదునూరి జ్యోతి, సదాలక్ష్మి, పి.ప్రేంపావని, ఎస్.ఛాయాదేవి, నళిని, జె.లక్ష్మి, విజయలక్ష్మి పండిత్, ఎ.లతాదేవి, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

మనువాదుల బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసేందుకు మనువాదులు పన్నుతున్న కుట్రలను తిప్పి కొట్టాలని, వారి బారి నుంచి తెలంగాణను కాపాడుకోవాలని ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ హరగోపాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. మనుస్మృతిని తగలబెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఓట్ల రాజకీయాల కోసం మనువాదులు సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ×మనువాదం ఉన్నచోట మానవత్వం ఉండదు×అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ప్రకృతికవి, ప్రముఖ రచయిత జయరాజుపై మను ఉన్మాదుల దాడులను ఖండిస్తూ స్వేచ్ఛ జేఏసీ గురువారం ఇక్కడ నిర్వహించిన సదస్సులో హరగోపాల్ మాట్లాడారు. మనువాదులు మాట్లాడే మురికి భాషను వింటుంటే నరహంతక ముఠా నాయకుడు నయీం వారసత్వాన్ని వారు అందిపుచ్చుకున్నట్లుగా ఉందని మండిపడ్డారు. మానవులు ప్రకృతి నుంచే వచ్చారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ప్రకృతిని ప్రేమించినవారు కచ్చితంగా మనుషులను ప్రేమిస్తారని పేర్కొన్నారు. స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ చైతన్యవంతమైన తెలంగాణ ప్రజలు జయరాజును కాపాడుకుంటారన్నారు. సదస్సులో ప్రముఖ కళాకారులు అంబిక, మచ్చ దేవేందర్, సామాజిక మేధావి డాక్టర్ జిలకర శ్రీనివాస్ తదితరులు పాల్గొని జయరాజుకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు, సీపీఐ (యం) రాష్ట్ర సీనియర్ నేత జి.రాములు, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.